"హాయ్ డాడ్! ఐ గాట్ సమ్ న్యూస్ ఎబౌట్ నీల్, ఈజ్ దట్ ట్రూ!"

"యా! బట్ హౌడూయూనో? నీకెవరు చెప్పారు?"

"అదేంటి డాడ్, టీ.వీలో వస్తుంటే...!"

"టీ.వీ.లో వస్తోందా?"

"యా! అదర్వైజ్ అమెరికాలో వున్ననాకెలా తెలుస్తుంది!"

"అప్పుడే అపొజిషన్ ఛానెల్స్ వాళ్ళు రేటింగ్ ప్రోగ్రామ్ స్టార్ట్ చేసేశారన్న మాట."

"అసలేం జరిగింది డాడ్!"

"మీ అమ్మ చెబుతుంది. టాక్ టు హర్. ఐ హేవ్ టు స్టాప్ దిస్ న్యూస్"అంటూ ఫోన్ వాళ్ళమ్మకిచ్చాను.

"హలో నందూ! చాలా ఘోరం జరిగిందే..."

"అమ్మా! నువ్వు ఏడవకు. నేనిప్పుడే టికెట్ బుక్ చేసుకొంటాను."

* * *

"సార్ మీకు తెలియంది కాదు. మీరూ అదే ఫీల్డులోనివారు. మీడియాకి వార్త చేరిందంటే ఎన్ని రకాల కథనాలు తయారవుతాయో మీకు తెలిసిందే. మీరూ చేసిందే. కాబట్టి మేం వెంటనే మీ అబ్బాయిని ఇంటికి పంపలేం. కేసు బుకింగు గురించి మీరూ, ఇంకా మిగిలిన పిల్లల పేరెంట్స్ కలిసి, మా సార్‌తో మాట్లాడ్తే ఫలితం ఉండవచ్చు. అందరూ పదహారు పదిహేడేళ్ళ లోపు పిల్లలే. శిక్షపడితే భవిష్యత్తు పాడవుతుందని చెప్పి చూడండి." అన్నాడా యస్.ఐ.

"మీ సార్ ఎప్పుడొస్తారు?", అడిగాన్నేను.

"వస్తారు ఓ అరగంటలో. వేరే పనిమీద వెళ్ళారు."


"అరగంటా! ఈలోపు కావలసినంత ప్రచారం జరుగుతుంది. పరువు కాస్తాపోతుంది. దొంగలుపడ్డ ఆర్నెల్లవరకూ రారా మీ సార్!" దాదాపు అరచినట్లుగా అడిగాడు మరో పిల్లాడి తండ్రి.

"నామీద అరుస్తారేంటి సార్! ఈ అరిచేదేదో మీ పిల్లల మీద అరిచుంటే, ఈరోజు ఇలా డ్రగ్స్ కేసులో పట్టుబడేవారు కారు. పిల్లలు మత్తుమందులకలవాటు పడితే పోని పరువు పోలీసుస్టేషనుకొస్తే పోతుందా!" అంతసేపూ ఏ కారణంగానో జాలితో వున్న ఎస్.ఐకి ఆ పిల్లాడి తండ్రి మాటలతో ఒక్కసారిగా కోపం వచ్చింది.

"కోప్పడకండి సార్! ఏదో బాధలో వుండి అలా అన్నారాయన. ఓ పక్క పిల్లలు ఇలా అయిపోయారనే బాధ, మరోపక్క ఈ మీడియా పబ్లిసిటీ. అందువల్లే..." అంటూ నే సర్దిచెప్పబోయాను. ఏం చేస్తాం. అవసరం మనది. ఈ క్షణాన పరువుకన్నా పని ముఖ్యం.

నా మాటలతో కొద్దిగా చల్లబడ్డ ఆ యస్.ఐ. "అది గ్రహించే కదసార్- మేమూ నెమ్మదిగా వున్నాం. అయినా మీరూ, ఆయనా కూడా తెల్లారి లేస్తే సంచలనాలకోసం వెంటపడే ఫీల్డులోని వారేగా! ఇతరుల గురించి చెప్పడంలో ఉండే ఆనందాన్ని మన గురించి ఇతరులు చెప్పినప్పుడు కూడా పొందాలి" అని ఒకసారి ఆ పెద్దమనిషికేసి విసురుగా చూసి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

పోతూపోతూ అతను చూసిన చూపే కాదు. అతనన్న మాటలు కూడా మా మనస్సుల్లో గుచ్చుకొన్నాయి. అంతవరకూ మేం పిల్లల తండ్రులుగానే




# పాఠం

## - వరిగొండ సత్యసురేఖ

ఆలోచించాం గానీ, నిన్నటివరకూ ఇదే తరహాలో సంచలన వార్తలను, మరింత సంచలనంతో ప్రచారం చేసిన వార్తా ఛానెల్స్ అధిపతులుగా మాకు మేము గుర్తుకు రాలేదు. మొదటిసారిగా ఏదో తప్పుచేసినట్లుగా తోచింది నాకు.

* * *

నానా గడ్డీ కరచి, కరిపించి, అధికారం, పరపతి, ధనం... ఇలా అన్ని సాధనాలనూ ఉపయోగించి పిల్లల్ని కేసుల్నించి బయటపడేయగలిగాం. కొన్ని నష్టదాయకమైన బిజినెస్ డీల్స్ చేసుకొని మరీ ప్రచారాన్ని ఆపేయగలిగాం.

ఇక ప్రజల గురించి, మాకన్నా ఎక్కువ ఎవరికి తెలుసు. ఇంకో హాట్ న్యూస్ చూపిస్తే నిమిషాల్లో పాత న్యూస్ మరచిపోతారు. అసలు ఒక విషయం గుర్తుండాలన్నా, మరచిపోవాలన్నా, ఏంచెయ్యాలన్నది మాకు వెన్నతో పెట్టిన విద్య.

* * *

రోజులు నిమిషాల్లా గడుస్తున్నాయి. నీల్‌కి గట్టి వార్నింగ్ ఇచ్చా. 'ఎలా అయినా ఎంజాయ్ చెయ్. కాని పోలీసులూ, మీడియాల చేతిలో మాత్రం పడొద్దు.'

అసలే వాడివల్ల కొన్ని కోట్ల నష్టం వచ్చింది బిజినెస్‌లో. అదంతా పూడ్చుకోవడానికి ఎన్ని సంచలనాలను చూపించాం. మరెన్ని సంచలనాలను సృష్టించాలి?

మళ్ళీ, నా దైనందిన జీవితంలో పడ్డా. ఒక తండ్రిగా నేను పడిన ఆవేదనను మర్చిపోయాను. ఎప్పట్లానే నెంబర్ వన్ రేటింగ్ రేస్‌లో పడిపోయాను.

* * *

కాలం గుఱ్ఱం లాంటిది. పరుగెత్తుతూనే వుంటుంది. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు వస్తూంటాయి. వచ్చినవి వచ్చినట్లు పాతబడిపోతూంటాయి. పాత వాటినుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలని, కాలం అంతర్లీనంగా ఇచ్చే సందేశాన్ని మనం మరచిపోకూడదని తెలిసి కూడా మరచిపోతుంటాం.

నీల్‌కి పెళ్ళైంది. ఒకప్పుడు మీడియాలో వార్త అయినవాడు ఇప్పుడు అదే వార్తా ప్రపంచాన్ని ఏలుతున్నాడు.

ఒకనాడు "ఎందుకమ్మా! మరొకరి సమస్యలతో ఆడుకొంటారు కొందరు?" అని ఎంతో ఆవేదనతో అడిగినవాడే ఇప్పుడు మరెంతో మంది సమస్యలను "ఆటలూ పాటలూ"గా మార్చి కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నాడు.

గత జీవితాన్నుండి వాడూ నాలానే ఒక కొత్త పాఠాన్ని నేర్చుకోలేదు. కాని కాలం ఊర్కోదుగా- నేర్చుకొనే వరకూ నేర్పుతూనే ఉంటుంది.

* * *

"నీల్! అమ్మాయి ఫ్లైట్ ఎప్పుడు?"

"మార్నింగ్ డాడ్!"

"చంటి పిల్లాడితో అదొక్కతే ఎందుకు? నువ్వా వెళ్ళొచ్చు కదరా!" వాళ్ళమ్మ అంటోంది.

"అమ్మా! మొన్ననే ఇక్కడ బ్లాస్ట్ జరిగింది. మంచి బిజినెస్ టైమ్. ఇప్పుడు సెన్సేషన్ మిస్సయ్యామనుకో, మళ్ళీ నెంబర్ వన్ పోతుంది."

"బ్లాస్ట్ జరిగి అంతమంది ప్రాణాలు పోయి, అయినవారిని కోల్పోతే నీకు బిజినెస్ టైమురా!" ఆవేశంగా అంది వాళ్ళమ్మ.

"అమ్మా! డోంట్ బి ఎమోషనల్. ఇదంతా బిజినెస్ ప్రపంచం. నేను కాకపోతే మరొకరు. ఎలాగూపోయారు. దాన్ని కాస్త స్పైసీ చేసి తప్పెవరిదని యస్.యం.యస్. పోల్స్ పెట్టి ప్రైమ్‌టైమ్‌లో ప్రసారం చేశామే అనుకో, ఏమవుతుంది? పోయినవాళ్ళు ఎలాగూ రారు. పైపెచ్చు 'మావాళ్ళుపోయారు' అని వాళ్ళవాళ్ళెవరూ, వాళ్ళ వాళ్ళ బంధువులకీ స్నేహితులకీ ఫోన్‌చేసి చెప్పక్కర్లేదు. ఎంచక్కా టీ.వీ.లో చూసేయచ్చు. ఫ్రీ సింపతీ. ఫ్రీ పబ్లిసిటీ. బోల్డు డబ్బు ఆదా! వాడ్డూయూసే డాడ్?" అంటూ నవ్వాడు. నేనూ వాడితో శ్రుతి కలిపాను.

మా నవ్వు వాడి భార్యకి కాని, నా భార్యకి కాని నచ్చినట్లు లేదు. సీరియస్‌గా ఒకరి మొహాన్ని ఒకరు చూసుకొని లోపలికి వెళ్ళిపోయారు. అలా వెళ్ళిన వాళ్ళని చూసి మేం తిరిగి నవ్వుకున్నాం. నవ్వు తప్ప మరేమీ అర్థంకాని మూడేళ్ళ నా మనమడు, నా కొడుకు తర్వాత ఇదే వ్యాపార ప్రపంచాన్ని ఏలాల్సిన వారసుడు, ముద్దుముద్దుగా మాతో నవ్వు కలిపాడు.

⁂ ⁂ ⁂

"నాన్నా!" ఉగ్రవాదులు పేల్చేసిన విమానంలో తన బిడ్డనీ, భార్యనీ కోల్పోయినట్లు వాడికి తెలిసిన క్షణంలో- నా బిడ్డ నన్ను పిలిచిన పిలుపులోని ఆర్ద్రత మొదటిసారిగా నా తనువంతటినీ తడిపేసింది.

"ఒకసారి మీ మామగారిని మళ్ళీ కన్‌ఫర్మ్ చేసుకోమను నాన్నా!" ఏం చెప్పాలో తెలియని క్షణంలోనే చెప్పిన మాట అది.

"లేదు నాన్నా! ఎవ్రీథింగ్ ఈజ్ ఓవర్. మై బేబీ, మై నీలూ... నో మోర్ నాన్నా!" అని ఏడుస్తున్న వాడిని చూసి వాడ్ని ఎలా ఓదార్చాలో, మమ్మల్ని మేం ఎలా ఓదార్చుకోవాలో తెలియక నేనూ, నా భార్య శిలాప్రతిమలమే అయ్యాము.

చిన్నపిల్లాడిలా, శూన్యంలోకి చూస్తున్న విరాగిలా, ఏదైనా అఘాయిత్యం చేసుకోబోయే అలివేణిలా- నానా రకాలుగా కనబడసాగాడు వాడు నా కంటికి.

ఇంతలో ఫోన్ మోగింది. అమెరికానుంచి అమ్మాయి.

"అమ్మా! అసలెలా జరిగింది..." అంటూ ఏడవసాగింది. ఈసారి "నీకెలా తెలిసిందమ్మా!"అని నేను కాని, వాళ్ళమ్మ కాని అడగలేదు. నందిత అవతలి వైపు

అమ్మా! డోంట్ బి ఎమోషనల్. ఇదంతా బిజినెస్ ప్రపంచం. నేను కాకపోతే మరొకరు. ఎలాగూపోయారు. దాన్ని కాస్త స్పైసీ చేసి తప్పెవరిదని యస్.యం.యస్. పోల్స్ పెట్టి ప్రైమ్‌టైమ్‌లో ప్రసారం చేశామే అనుకో, ఏమవుతుంది? పోయిన వాళ్ళు ఎలాగూ రారు. పైపెచ్చు 'మావాళ్ళుపోయారు' అని వాళ్ళవాళ్ళెవరూ, వాళ్ళ వాళ్ళ బంధువులకీ స్నేహితులకీ ఫోన్‌చేసి చెప్పక్కర్లేదు.

నుంచి మాట్లాడుతోంది. స్పీకర్ ఫోన్లోంచి తన మాటలు అందరికీ వినిపిస్తున్నాయి. వినిపించాలనే బహుశఃవాళ్ళమ్మ స్పీకర్ ఫోను ఆన్ చేసినట్లుంది.

"ఇప్పుడే టీ.వీలో చూశాను. అమ్మా! వీళ్ళకి కొంచెం కూడా జాలిలేదమ్మా! తమ్ముడు అంత బాధలో వుంటే ఫ్లాష్ న్యూస్ అనీ యస్.యం.యస్. పోల్స్ అనీ, అదనీ ఇదనీ చూపిస్తున్నారు. 'బిజినెస్‌లో హీరో జీవితంలో జీరో' అంటూ ఓ దిక్కుమాలిన ప్రోగ్రామ్. వీళ్ళేం మనుషులమ్మా! అవతల మనవారు పోయి మనం పుట్టెడు దుఃఖంలో వుంటే, వీళ్ళు... ..."

నందిత ఆవేశంతో ఆవేదనతో మాట్లాడ్తూనే వుంది.

నేనూ, నీల్ వింటున్నాం. చెవులతో కాదు. మనసుతో.

"ఒకరి బాధ మరొకరి వినోదం కాకూడదు" నీలవేణి అంటూండే మాటనాకే కాదు వాడికీ గుర్తొచ్చి వుంటుంది. నందు 'రేపు బయల్దేరుతున్నా'నని చెప్పి ఫోన్‌పెట్టేసింది. వాళ్ళమ్మ భారంగా అడుగులువేస్తూ లోపలికి వెళ్ళేదల్లా ఒక్క క్షణం ఆగి.

"నీల్, మనం కూడా ఎవరికీ ఫోన్ చేయనక్కర లేదు. బోల్డు డబ్బు ఆదా! నీ మీద నువ్వే ఒక ప్రోగ్రాం చేయి. బోల్డు సింపతీ. మరెంతో పబ్లిసిటీ. చూశావా- మూడేళ్ళ పసివాడు పోతూపోతూ నీకెంత లాభం చేకూర్చాడో..."అంటూ చీర చెంగును నోటికడ్డం పెట్టుకొని, ఏడుస్తూ లోపలికి పరుగెత్తిన వాళ్ళమ్మ వైపే రాయిలా చూస్తూండిపోయాడు నీల్.

⁂ ⁂ ⁂

ఈసారి మేం పాఠాలు నేర్చుకున్నాం. "కాలమా! మేం మనుషులుగా మారాం. జీవితంలో ఈనాడు గ్రహించిన ఈ కొత్త పాఠం మరెన్నిటికీ పాతబడనివ్వం. ఇంకెన్నడూ ఏ ఒక్కరి బాధనీ, ఏ ఒక్కరి సమస్యనీ మా ఎదుగుదలకి ఉపయోగించుకోం. సమస్యల గురించి సమాజానికి అవగాహన కల్పించాల్సిందిపోయి, సమాజాన్నే అస్తవ్యస్తంగా మారుస్తున్న మమ్మల్ని చూసి మాకే అసహ్యమేస్తోంది. ఇంకెప్పుడూ మేం విలువలను మట్టిపాలు చేయం" అని నా అంతర్వాణి ప్రతిజ్ఞ చేస్తున్నట్లనిపించింది నాకు.

నాకు తెలుసు, నా బిడ్డ కూడా ప్రతిజ్ఞచేసే వుంటాడు. ఎందుకంటే- ఇలాంటి పాఠాన్ని ఎప్పుడూ ఎన్నటికీ ఎవ్వరూ మరిచిపోరు కదా!

★

**రచయిత్రి చిరునామా:**
**కాసర్ల (వరిగొండ) సత్యసురేఖ**
5-7-, జీవన్‌మిత్రానగర్,
విద్యారణ్యపురి, హనుమకొండ- 506009.


# భూలోక గ్రామంలో...

**భూ**లోకం చిన్న గ్రామంగా మారితే ప్రపంచ ప్రజలంతా ఆ గ్రామంలో ఆర్థిక సామాజిక, మత జీవన స్థాయిలాంటి వ్యత్యాసాలతో యధాతథంగా జీవిస్తే అప్పుడు ఆ గ్రామంలో...

- *57 మంది ఆసియావాసులు*
- *21 మంది యూరోపియన్స్*
- *14 మంది వెస్టర్న్ హెమిస్ఫియర్ వారు*
- *8మంది ఆఫ్రికన్స్ ఉంటారు.*
- *52 మంది ఆడవాళ్ళు*
- *48 మంది మగవారు ఉంటారు.*
- *70 మంది శ్వేత జాతీయేతరులు*
- *30 మంది శ్వేత జాతీయులు ఉంచారు.*
- *70 మంది క్రిస్టియనేతరులు*
- *30 మంది క్రిస్టియన్స్ ఉంటారు.*
- *ఆరుగురు ప్రపంచంలోని 59% సంపదకి యజమానులు. వారంతా అమెరికా దేశస్థులే!*
- *80 మంది కనీస అవసరాలు తీర్చుకోలేని ఇళ్ళల్లో నివశిస్తారు.*
- *70 మందికి విద్య ఉండదు.*
- *50 మంది పౌష్టికాహారం లేక బాధపడుతుంటారు.*
- *ఒకరు చావుకి దగ్గరగా ఉంటారు.*
- *ఒకరు పుట్టుకకి దగ్గరగా ఉంటారు.*
- *ఒకరికే కాలేజీ విద్య ఉంటుంది.*
- *ఒకరికే కంప్యూటర్ ఉంటుంది.*

**- డి.పద్మజ**

# అరుదైన కలయిక



*ఇది ఇద్దరు అసాధారణ వ్యక్తుల సమాగమం. టైనీ అయర్న్ అనే దైత్యాకారుడితో ఖగేంద్ర థాపా మగర అనే ప్రపంచంలోనే అత్యంత పొట్టి వ్యక్తిభేటీ అయిన దృశ్యమిది. టైనీ ముంజేయి పొడవు 24 అంగుళాలు. అది ఖగేంద్ర మొత్తం శరీరం పొడవుకన్నా రెండంగుళాలు ఎక్కువ. అంటే అతని పొడవు 22 అంగుళాలు మాత్రమే! టైనీ బరువు 289 పౌండ్లు (అంటే 127 కిలోలు). ఖగేంద్ర బరువు కేవలం 10 పౌండ్లు అంటే 2 కిలోల 536 గ్రాములు మాత్రమే.*

*28 ఏళ్ల వయసున్న టైనీ బ్రిటన్‌లోనే అత్యంత పొడవైన ముంజేయి ఉన్న వ్యక్తిగా ప్రసిద్ధుడు. ఇక ఖగేంద్రుడిది ప్రపంచ ఖ్యాతి. ప్రపంచంలోనే టీనేజ్ కుర్రాళ్లలో అత్యంత కురచవ్యక్తి ఇతను. మొన్న అక్టోబర్ 14న ఖగేంద్ర 18 ఏళ్ల యువకుడు అయ్యాడు. అప్పుడు మరో ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పటిదాకా యుక్త వయసు వచ్చిన వారిలో అత్యంత కురచ వ్యక్తి అయిన 27 అంగుళాల ఎత్తుండే 24 ఏళ్ల కొలంబియా డ్యాన్సర్ ఎడ్వర్డ్ నినో హెర్నాండెజ్ రికార్డును బద్దలు కొట్టి సరికొత్త రికార్డును సొంతం చేసుకున్నాడు. అన్నట్లు ఈ ఖగేంద్ర మన పొరుగు దేశమైన నేపాల్‌కు చెందిన వాడే!*

**-ఆర్కే**